# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 09-11-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ రోజు లువాండాలో అంగోలా అధ్యక్షులు జోవో లౌరెంకోతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు.
- ❖ ఉత్తరాఖండ్ లో 8 వేల 140 కోట్ల రూపాయలకు పైగా విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించి, శంకుస్థాపన చేశారు.
- ❖ భారతదేశ ఆధ్యాత్మిక ప్రయాణం, వారసత్వానికి జైన తత్వశాస్త్రం గొప్ప సహకారాన్ని అందించిందని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు.
- ❖ బీహార్ అసెంబ్లీ ఎన్నికల రెండవ, చివరి దశ ప్రచారం ఈ రోజు సాయంత్రంతో ముగిసింది.
- ❖ సమాజంలోని ప్రతి చోటుకు న్యాయం, న్యాయ సహాయం చేరేలా చేసే ప్రయత్నాలను బలోపేతం చేయాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రజలను కోరారు.

======================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ రోజు లువాండాలో అంగోలా అధ్యక్షులు జోవో లౌరెంకోతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య బహుముఖ భాగస్వామ్యాన్ని మరింతగా పెంచే లక్ష్యంతో చర్చలు జరిగాయి. రెండు దేశాల ఉమ్మడి ప్రాధాన్యతలు, విస్తృత శ్రేణి రంగాలలో సహకార ప్రాముఖ్యతను రాష్ట్రపతి ప్రస్తావించారు. పరస్పర వృద్ధి, శ్రేయస్సు కోసం అవకాశాలను ఉపయోగించుకోవడంలో అంగోలాతో కలిసి పని చేయడానికి భారతదేశ సంసిద్ధతను ద్రౌపది ముర్ము తెలియజేశారు.

(వాయిస్ 27 సెకన్లు)

అంతకుముందు, లువాండాలోని ప్రెసిడెన్షియల్ ప్యాలెస్‌లో రాష్ట్రపతికి ఘన స్వాగతం లభించింది. ఇదిలా ఉండగా అంగోలా 50వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా లువాండాలో పర్యటించడం చాలా సంతోషంగా ఉందని రాష్ట్రపతి ఒక ప్రకటనలో తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్ రాష్ట్ర అవతరణ రజతోత్సవ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు పాల్గొన్నారు. డెహ్రాడూన్‌లో జరిగిన కార్యక్రమంలో 8 వేల 140 కోట్ల రూపాయలకు పైగా విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభించి, శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద 62 కోట్ల రూపాయలకు పైగా ఆర్థిక సహాయాన్ని 28 వేల మందికి పైగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా బదిలీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నరేంద్ర మోదీ మాట్లాడుతూ... ఉత్తరాఖండ్‌ను అభివృద్ధిలో కొత్త శిఖరాలకు తీసుకెళ్లడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రం నుండి 15 వ్యవసాయ ఉత్పత్తులకు జిఐ ట్యాగ్‌లు వచ్చాయని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ ఆధ్యాత్మిక ప్రయాణం, వారసత్వానికి జైన తత్వశాస్త్రం గొప్ప సహకారాన్ని అందించిందని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. కర్ణాటకలో హసన్ జిల్లా శ్రావణబెళగొళలో ఈరోజు జరిగిన జైన సాధువు ఆచార్య శాంతి సాగర్ మహారాజ్ స్మారక సభలో ఉపరాష్ట్రపతి పాల్గొని ప్రసంగించారు. జైన మతం సూత్రాలైన అహింస, స్వీయ నిగ్రహం, త్యాగం.. భారతీయ సమాజ ఆధ్యాత్మిక నైతికతను గొప్పగా ప్రభావితం చేశాయన్నారు. జైనమత శాంతి, సామరస్య సందేశం ఆధునిక ప్రపంచంలో కూడా మరింత ప్రాముఖ్యతను కలిగి ఉందని ఉపరాష్ట్రపతి తెలిపారు. ప్రాకృతాన్ని శాస్త్రీయ భాషగా ప్రకటించి, జైనమతానికి చెందిన అన్ని మత గ్రంథాలను డిజిటలైజ్ చేసే లక్ష్యాన్ని ప్రారంభించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఉపరాష్ట్రపతి కృతజ్ఞతలు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

సమాజంలోని ప్రతి చోటుకు న్యాయం, న్యాయ సహాయం చేరేలా చేసే ప్రయత్నాలను బలోపేతం చేయాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రజలను కోరారు. ఈ రోజు ప్రపంచ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కేంద్రమంత్రి స్పందిస్తూ... న్యాయం, సమానత్వం, చట్టపరమైన సాధికారత స్ఫూర్తిని అందుకోవాలని సూచించారు. చట్టాన్ని పొందడం ఒక హక్కు మాత్రమేనని ఒక ప్రత్యేక హక్కు కాదని ఈ రోజు అందరికీ గుర్తు చేస్తుందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

తూర్పు వైమానిక కమాండ్ 93వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈరోజు గౌహతిలో భారత వైమానిక దళం మొట్టమొదటి పూర్తి స్థాయి వైమానిక ప్రదర్శనను నిర్వహించింది. బ్రహ్మపుత్ర నది పైన ఉన్న లచిత్ ఘాట్‌లో 75కి పైగా విమానాలు, హెలికాప్టర్‌లతో ప్రదర్శన జరిగింది. అస్సాం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

బీహార్ అసెంబ్లీ ఎన్నికల రెండవ, చివరి దశ ప్రచారం ఈ రోజు సాయంత్రంతో ముగిసింది. ఈ దశలో నవంబర్ 11న 20 జిల్లాల్లోని 122 అసెంబ్లీ నియోజకవర్గాలలో పోలింగ్ జరగనుంది. ఈ విడతలో 136 మంది మహిళా భ్యర్థులతో సహా ఒక వెయ్యి 302 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. 3 కోట్ల 70 లక్షల మందికి పైగా ఓటర్లు తమ

ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రచారం చివరి రోజు కావడంతో ఎన్డీయే, మహాఘట్ బంధన్ కూటముల నుండి ముఖ్య నాయకులు విస్తృత ప్రచారం చేశారు. ఈనెల 14వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ 2.0, వినూత్న ఫైనాన్సింగ్ వంటి పథకాల ద్వారా స్వయం-సమృద్ధి సాధించే నగరాలను నిర్మించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖాన్ సాహు అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన నేషనల్ అర్బన్ కాన్క్లేవ్-2025లో మంత్రి ప్రసంగిస్తూ... 2030 నాటికి నగరాలు, పట్టణ ప్రాంతాలు దేశ జి.డి.పి.కి 70 శాతానికి పైగా దోహదపడతాయని పేర్కొన్నారు. 2050 నాటికి దేశ పట్టణ జనాభా 87 కోట్ల 60 లక్షలకు మించి ఉంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్ రాష్ట్ర అవతరణ రజతోత్సవ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశ అద్భుతమైన, ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రయాణానికి ఉత్తరాఖండ్ అసమానమైన కృషి చేసిందని రాష్ట్రపతి అన్నారు. ప్రకృతి ఒడిలో నెలకొని ఉన్న ఈ దివ్యభూమి నేడు పర్యాటకంతో పాటు ప్రతి రంగంలోనూ కొత్త పురోగతిని సాధిస్తోందని ప్రధానమంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఈశాన్య ప్రాంతాన్ని అష్టలక్ష్మిగా పేర్కొంటూ.. ఆ ప్రాంత అభివృద్ధి మంత్రి జ్యోతిరాదిత్య సింధియా రాసిన ఒక కథనాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఈశాన్య ప్రాంతం ఆగ్నేయాసియాకు భారతదేశ సహజ ద్వారంగా ఎలా మారుతుందో ఈ వ్యాసం వివరిస్తుందని ప్రధానమంత్రి అన్నారు. ఈ ప్రాంతం భారతదేశ సరిహద్దు మాత్రమే కాదని, జరుగుతున్న అభివృద్ధికి ప్రతీక అని నరేంద్రమోదీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

గుజరాత్ ఉగ్రవాద వ్యతిరేక దళం గాంధీనగర్ అదాలజ్ లో ముగ్గురు అనుమానిత ఉగ్రవాదులను ఈ రోజు అరెస్టు చేసింది. వారి నుండి ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. అనుమానితులు దేశంలోని వివిధ ప్రాంతాలలో దాడులకు ప్రణాళిక వేస్తున్నారని అధికారులు తెలిపారు. ఉగ్రవాద సంస్థ ISISతో ఈ ముగ్గురు సంబంధం కలిగి ఉన్నారని అధికారులు అనుమానిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

కంబోడియా దేశ 72వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఆ దేశ ప్రభుత్వానికి, ప్రజలకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి నాగరికత సంబంధాలను కలిగి ఉన్న కంబోడియాతో విస్తృత సహకారాన్ని భారతదేశం విలువైనదిగా భావిస్తుందని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లలో రాబోయే మూడు రోజులు చలిగాలులు వీస్తాయని భారత వాతావరణ విభాగం (IMD) అంచనా వేసింది. ఈశాన్య భారతదేశంలో రాబోయే రెండు, మూడు రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రత రెండు నుండి

మూడు డిగ్రీల సెల్సియస్ తగ్గుతుందని తెలిపింది. మరిన్ని వాతావరణ వివరాలను ఐఎండీ శాస్త్రవేత్త షిబిన్ బాలకృష్ణన్ తెలియజేస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =